

అసంపూర్తిగా వదిలేశారు

- తవ్వి వదిలేసిన రోడ్లతో ప్రజల ఇబ్బందులు
- వర్షాలు కురిస్తే మరింత కష్టాలు



ముకరంపురలో కంకర పోసి వదిలిపెట్టిన రోడ్డు

కరీంనగర్ టౌన్, మే 17: ఎన్నికలకు ముందు నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, పనులు చేయడం వంటి సందడి కనిపించింది. ఇక్కడ, అక్కడ అన్న తేడా లేకుండా నగరంలోని 60 డివిజన్లలో ఓవైపు స్మార్ట్‌సిటీ, మరోవైపు సీఎం హామీ నిధులు, మున్సిపల్ జనరల్ ఫండ్, ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనుల జాతర నెలకొన్నది. ఒకే ప్యాకేజీ కింద సీఎం హామీ నిధులు 133 కోట్లకు సంబంధించిన పనులన్నింటిని ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించి ఆరు నెలల్లో పనులన్నీ పూర్తి చేస్తామని అప్పటి మంత్రి గంగుల కమలాకర్ ప్రకటించారు. ప్రారంభోత్సవాలు చేసిన వెంటనే పనులు ప్రారంభించాలని, ప్రజలకు ఇబ్బం దులు కలుగకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యం లోనే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది. అంతే సీన్ మారి పోయింది. నవంబరు నుంచి అభి వృద్ధి పనులను ప్రారంభించడం నిలిపివేశారు. దీనితో అప్పటి వరకు స్మార్ట్‌సిటీ పనులు దాదాపు ముగింపు దశకు చేరుకోగా, సీఎం హామీ నిధులతో చేపట్టనున్న పనుల్లో దాదాపు 50 శాతం వరకు పనులు పూర్త య్యాయి. కొన్ని రోడ్లను తవ్వి మధ్యలోనే అసం పూర్తిగా వదిలిపెట్టారు. ఆ పనులు ముందుకుసాగడం లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఆరేడు నెలల నుంచి అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. పార్లమెంట్ ఎన్నికలు ముగిసినా జూన్ 4న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంది. దీంతో కొత్తగా చేపట్టే పనుల ప్రారంభోత్సవాలు చేయడం కుదరదు. అయితే అసంపూర్తి పనులను చేసేందుకు కోడ్ అడ్డంకి కాదని, ఆ పనులైనా పూర్తి చేయడం లేదని ప్రజలు కోరుతున్నారు.

● ఇళ్లలోకి వెళ్లేందుకూ ఇబ్బందులు

సీఎం హామీ నిధులతో ప్రతి డివిజన్‌లో ఒకటి రెండు చోట్ల రోడ్లు, డ్రైనేజీల కోసం పాత రోడ్లను తవ్వి వదిలిపెట్టారు. కొన్ని చోట్ల రోడ్లపై కంకర, డస్ట్ పోసి వదిలివేశారు. దీంతో ఆయా రోడ్లను ఆనుకుని ఉన్న ఇంటి యజమానులు కనీసం ఇళ్లలోకి కూడా వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. మోకాలు లోతులో రోడ్లను తవ్వి వదిలివేయడంతో వారి వాహనాలను ఇళ్లలోకి తీసుకెళ్లడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇంటి ముందు ఉన్న మెట్లు, ర్యాంప లను, నల్లా కనెక్షన్లను, డ్రైనేజీలను తొలగించడంతో పనులు పూర్తయ్యేదెన్నడో తెలియక చాలా మంది వారి ఇళ్ళ ముందు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ రోడ్ల నుంచి వెళ్ళడమే కష్టంగా మారింది. కొన్ని చోట్ల వాహనదారులు వేరే దారులను వెతుక్కొని వెళ్తున్నారు. తప్పనిసరిగా వెళుతున్న వారు వాహనాల దెబ్బతింటు న్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వేసిన రోడ్లు ఎప్పుడవుతాయో ఏమో కానీ ఉన్న రోడ్లను తవ్వి నాశనం చేశారని, దీనితో ఇబ్బందులు పడుతున్నామని, ఎన్నికలు పూర్తయినా కూడా పనులు ప్రారంభించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. నిన్నటి వరకు ఎండల తీవ్రతతో డస్ట్ దుమ్మొ దూళీగా మారి ఇళ్ళలోకి చేరగా, ఇప్పుడు చినుకు పడితే చాలు రోడ్లపై నుంచి నడవడమే కష్టమవుతుంది. ఈసారి వర్షాలు ముందే కురుస్తుండడంతో భారీ వర్షాలు కురిస్తే మోకాలు లోతు తవ్వి వదిలిన రోడ్ల నుంచి ఇళ్లలోకి పోవ డమే కష్టమవుతదని, అసంపూర్తి పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.



విద్యానగర్‌లో కంకర పోసి అసంపూర్తిగా ఉన్న రోడ్డు

స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత

- కేంద్ర సాయుధబలగాలతో 24 గంటల కాపలా
- సీసీ కెమెరాలతో నిఘా, 144 సెక్షన్ అమలు
- ప్రతి రోజు ఎన్నికల అధికారి, పోలీసు అధికారుల తనిఖీ

కరీంనగర్ క్రైం, మే 17: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా కీలకమైన పోలింగ్ పర్వం ముగియడంతో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని కరీంనగర్, హుజూరాబాద్, చొప్పదండి, మానకొండూర్, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజక



వర్గాలకు చెందిన 2,194 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీ ఎంలను కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్‌రూంలలో భద్రపరిచారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూం లను సీల్ చేయటమే కాకుండా మూడంచెల భద్రతలో భాగంగా గదుల ఎదుట మొదటి దశలో కేంద్ర సాయుధ బలగాలు, రెండో దశలో కళాశాల భవనంలోని అన్ని ద్వారాల వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు (ఏఆర్)బలగాలు, మూడోదశలో కళాశాల ప్రధాన గేట్‌తో పాటు కళాశాల ప్రహరీ చుట్టూ స్థానిక సివిల్ పోలీసులను మోహరించారు. స్ట్రాంగ్‌రూంలు భద్రపరిచిన ఎస్సారార్ కళాశాల ప్రాంతంలో చీమ చిటుక్కుమన్నా పసిగట్టేలా సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేశారు. ఇక్కడ 24 గంటల పాటు పోలీసు గస్తీని కూడా ఏర్పాటు చేసి ఉన్నతాధికారులు పర్య వేక్షిస్తున్నారు. ప్రతిరోజు ప్రత్యేక టీంలతో వాచ్ చేస్తున్నారు. ఎస్సారార్ కళాశాల చుట్టూ వంద మీటర్ల దూరం వరకు సీఆర్‌పీసీ 144 సెక్షన్ అమలు పరుస్తున్నారు. ప్రతి రోజు ఎన్నికల సంఘం అధికారులు, పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులు స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రతను పరిశీలిస్తున్నారు. ఎస్సారార్ కళాశాల మైదనాంలో ఉదయం, సాయంత్రం వేళ వాకర్స్‌ను నిషేధించారు. కౌంటింగ్ ముగిసే వరకు వాకర్స్‌ను అనుమతించకుండా ఆదేశాలు జారీ చేశారు.

● స్ట్రాంగ్‌రూంల భద్రతను అభ్యర్థులు పరిశీలించవచ్చు....

ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను వివిద రాజకీయ పార్టీల నుంచి పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు ఎప్పుడైనా భద్రతను పరిశీలించేందుకు అధికారులు అవకాశం కల్పించారు. స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉందా? ఇంకేమైనా అనుమానాలుంటే సీసీ కెమెరాల ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. సీసీ కెమెరాల ద్వారా స్ట్రాంగ్‌రూంల వద్ద పరిస్థితిని పరిశీలించేందుకు 24 గంటలపాటు ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

తడిసిన ప్రతీ గింజను కొనాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న వాసుదేవరెడ్డి

హుజూరాబాద్, మే 17: అకాల వర్షానికి తడిసిన ప్రతీ గింజను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండ్రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి పలు చోట్ల ధాన్యం తడిసిందని, మామిడి కాయలు నేలరాలాయని, పిడుగు పాటుతో ఆవులు, గేదెలు మృతి చెందాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పండించే రైతులకు మాత్రమే క్వింటాల్‌కు 500 రూపాయలు బోనస్ చెల్లించనున్నట్లు ప్రకటనలు వస్తున్నాయని, దీంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. రాష్ట్రంలో 80 శాతం రైతులు దొడ్డు వడ్లను పండిస్తారని, సన్న వడ్లను 20శాతం మాత్రమే పడిస్తారన్నారు. దొడ్డు వడ్లను పండించే రైతులు అధికులు సన్న, చిన్నకారు రైతులేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అన్ని రకాల వడ్లకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వెల్మరెడ్డి రాజిరెడ్డి, గుండేటి వాసుదేవ్, ఎండీ హుస్సేన్ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై బీజేపీ రణభేరి

- నేడు వడ్ల కల్లాల సందర్శన
- 20న తహసీల్దార్, కలెక్టర్లకు వినతిపత్రాలు
- 21న అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షలు

భగత్‌నగర్,మే 17: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రైతు సమస్యలపై భారతీయ జనతా పార్టీ రణభేరీ మోగించింది. ఆరు గ్యారంటీల అమలుపై వివిధ రూపాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఆందోళ నలు నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా బీజేపీ నేతలంతా తమ తమ ప్రాంతాల్లో వడ్ల కల్లాలను సందర్శించనున్నారు. ఇప్పటికే అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవ డంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ విమర్శిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలను అధిగ మించి పండించిన వడ్లను కల్లాల వద్దకు తీసుకొచ్చి రోజలు గడుస్తున్నా కొనుగోలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తున్న తీరును కల్లాల సందర్శన ద్వారా ఎండగట్టాలని నిర్ణయిం చింది.

● మండల కమిటీలో బండి సంజయ్ టెలీ కాన్ఫరెన్స్

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ శుక్రవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మండల కమిటీలు, ఆ పైస్థాయి నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించేందుకు నాయకులు వడ్ల కల్లాలను సందర్శించాలని సూచించారు. తద్వారా పంట నష్టం వివరాలను సేకరించడంతోపాటు తాలు, తరుగు, తేమతో సంబంధం లేకుండా వడ్లను కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు.



కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు అన్ని రకాల ధాన్యానికి క్వింటాలుకు 500 రూపా యల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేయాలన్నారు. భరోసా కింద వచ్చే వానాకాలం సీజన్ నుండి రైతులు, కౌలు రైతులకు ఎకరాకు 15 వేలు, రైతు కూలీలకు 12 వేలు ఇచ్చేదాకా సర్కార్‌పై వివిధ రూపాల్లో నిరసనలు తెలపాలని సూచించారు. రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలంటే దాదాపు 35 వేల కోట్ల నిధులు అవసరమని, ఆ నిధులు రాష్ట్ర ప్రభుత్వం వద్ద లేవని అన్నారు. వీటితోపాటు ఆరు గ్యారంటీల అమలుకు మరో లక్ష కోట్ల రూపాయలు అవసరమవుతాయని తెలిపారు. ఈ నిధులను సమీకరించడంతోపాటు ఆరు గ్యారంటీల అమలు కోసం విధివిధానాలను రూపొందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. దీనిని కప్పిపుచ్చుకునేందుకు 'స్థానిక సంస్థల' ఎన్నికలను తెరపైకి తీసుకొస్తోందన్నారు. కాంగ్రెస్ సర్కార్ నిర్వాకం వల్ల రాష్ట్ర ప్రజలతోపాటు రైతులు తీవ్రమైన సంక్షోభంలో పడిపోయారన్నారు. పండించిన వడ్లను కూడా అమ్ముకోలేని దుస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంక్షోభ సమయంలో రైతులకు అండగా నిలవడంతోపాటు వడ్లను కొనుగోలు చేసే వరకు, బోనస్ ఇచ్చే వరకు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా శనివారం వడ్ల కల్లాలను సందర్శించాలని ఆదేశించారు. ఆదివారం అన్ని మండల, నియోజకవర్గ కేంద్రాల్లో మీడియా సమావేశాలు నిర్వహించి రైతులు పడు తున్న ఇబ్బందులను ప్రజలకు తెలియ జేయాలన్నారు. సోమవారం అన్ని మండల, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో తహిసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు రైతు సమస్యలపై వినతి పత్రం అందజేయాలని ఆదేశించారు. 21న కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో రైతుల పక్షాన దీక్షలు చేపట్టాలన్నారు. అయినా ప్రభుత్వం దిగిరాకపోతే బీజేపీ చేపడుతున్న ఆందోళనను మరింత తీవ్రం చేసేలా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

అధిక రక్తపోటుపై అవగాహన కల్పించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

సుభాష్‌నగర్, మే 17: అధిక రక్తపోటుపై ప్రజలకు నెలరోజులపాటు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత సూచించారు. ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినాన్ని పురస్కరించుకుని న్యూఢిల్లీ నుంచి హెల్త్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇండియా వెబ్‌నార్ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అధిక రక్తపోటుకు గల కారణాలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. 30 సంవత్సరాలపై వారికి అనారోగ్య అలవాట్ల కారణంగా రావచ్చన్నారు. అధిక రక్తపోటుతో తీవ్రమైన తలనొప్పి, దృష్టిలోపం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చాతినొప్పి, అలసట, మూత్రంలో రక్తం రావడం, గుండే వేగంగా కొట్టుకోవడం, మొదలైన లక్షణాలు కనిపించవచ్చన్నారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సంప్రదించి ఉచితంగా మందులు పొందవచ్చన్నారు. అధిక రక్తపోటుకు గురికాకుండా ఉండాలంటే మంచి ఆరోగ్య అలవాట్లు పాటించాన్నారు. మంచి ఆహారం, ఆకుకూరలు, గుడ్లు తీసుకోవడంతోపాటు ప్రతిరోజు 30 నిమిషాల నడక, యోగా, మెడిటేషన్ లాంటివి దిన చర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. ఉప్పు వాడకాన్ని తగ్గించాలని, ధూమపానం మద్యపానం పూర్తిగా మానేయాలని, జంక్‌ఫుడ్, ఫ్రైడ్ చికెన్, మటన్ లాంటి పదార్థాలు తక్కువగా తీసుకోవాలని సూచించారు.

తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

కరీంనగర్ రూరల్, మే 17: కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైసుమిల్లులకు తరలించాలని సివిల్ సప్లయిస్ డీఎం రజనీకాంత్, డీఎస్‌వో సురేష్‌రెడ్డి నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం కరీంనగర్ మండలం నగునూరు వ్యవసాయ మార్కెట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలించారు. రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కాంటాలు పెట్టాలని నిర్వాహకులకు సూచించారు. ప్రస్తుతం మూడు రైసు మిల్లులకు ధాన్యం తరలిస్తుండగా అదనంగా మరో రెండు మిల్లులను కెటాయించినట్లు తెలిపారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కాంటాలు పెట్టిన వెంటనే ధాన్యం బస్తాలను లారీల్లో రైసుమిల్లులకు తరలించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ సింగిల్ విండో సీఈవో రమేశ్, డైరెక్టర్ సాయిల్ల మహేందర్ పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాఠశాలల ప్రారంభంలోపు దుస్తులు అందించాలి

ఇల్లందకుంట, మే 17: పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు దుస్తులు అందించాలని డీఆర్డీవో శ్రీధర్ అన్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంలో పదిరోజులుగా డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే దుస్తులు కుట్టిస్తున్నారు. శుక్రవారం డీఆర్డీవో శ్రీధర్ దుస్తులు కుడుతున్న కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుస్తులను నాణ్యతంగా కుట్టాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్, ఏపీఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్ భవనం పూర్తయ్యేదెన్నడు..?



నిలిచిన భవన నిర్మాణం



మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న ఫైర్ స్టేషన్

● చొప్పదండిలో నిలిచిపోయిన నిర్మాణ పనులు

చొప్పదండి, మే 17: చొప్పదండిలో ఫైర్ స్టేషన్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిధులు లేక పనులు నిలిచిపో యినట్లు సమాచారం. ఏళ్ల గడిచిన ఫైర్ స్టేషన్ భవనం నిర్మాణం పూర్తి కాకపోగా చొప్పదండి మున్సిపల్ కార్యాలయ భవనంలో తాత్కాలికంగా కొనసాగుతోంది. నియోజక వర్గానికి ఒక ఫైర్ స్టేషన్‌ను ఉండాలని 2017 లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అదే సంవత్సరం చొప్పదండికి 30 లక్షల రూపా యలతో అగ్నిమాపక కేంద్రం మంజూరైంది 2018 ఆగస్టు నెలలో అప్పటి మంత్రి ఈటల రాజేందర్ అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నవోదయ విద్యాలయం ఎదుట ఉన్న స్థలాన్ని కేటా యించారు. ఆరు సంవత్సరాలు గడుస్తున్నా అగ్నిమాపక భవనం నిర్మాణం పూర్తి కాలేదు. ప్రస్తుతం అగ్నిమాపక కేంద్రం పురపాలక సంఘ భవ నంపై అంతస్తులో తాత్కాలికంగా కొనసా గుతుంది. అగ్నిమాపక వాహనం ఆరుబయట రోడ్డుపై ఎండలోనే ఉంటుంది. వానలో తడిచి ఎండలో ఎండి అనేకసార్లు మొరాయించింది. ఈ అగ్నిమాపక కేంద్రం చొప్పదండితోపాటు పొరుగున ఉన్న ధర్మారం, రామ డుగు, జూలపల్లి మండలాలకు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగకరంగా ఉంటుంది. పురపాలక సంఘం కార్యాలయ సిబ్బంది సంఖ్య పెరగడంతో భవనం సరిపోవడం లేదని ఫైర్ స్టేషన్‌ను తరలించాలని మున్సిపల్ పాలకవర్గం ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకుపోయారు. భవన నిర్మాణం పూర్తిచేసి ఫైర్ స్టేషన్‌ను ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.



ఫైర్ స్టేషన్ శిలాఫలకం

రూ.7,190 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 17: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,190 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు రైతులు 95 క్వింటాళ్ల పత్తి తీసుకువచ్చారు. వ్యాపారులు గరిష్ఠ ధర 7,190 రూపాయలు, కనిష్ఠ ధర ఐదు వేల రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, మే 17: మండలంలో వెంకటాపూర్ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని ఎస్‌ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. వాహనాన్ని స్వాధీన పర్చుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

అకాల వర్షంతో నష్టం

● తడిసిన ధాన్యం ● విరిగిపడిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కురిసిన వర్షానికి భారీ నష్టం వాటిల్లింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి.

మెట్‌పల్లి రూరల్, మే 17: మండలంలో గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుతో పాటు మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

● ఇబ్రహీంపట్నం: మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, గోధుర్, వేములకుర్తిలో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది.

● కథలాపూర్: మండలంలోని చింతకుంట, ఊట్‌పల్లి, పెగ్గెర్ల, భూషణరావుపేట, దుంపెట గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వ ర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. పలు గ్రామాల్లో వీధులు జలమయమయ్యాయి.

● మల్యాల: మండలంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రామన్నపేట, మల్యాల, ముత్యంపేట, తాటిపల్లి, లంబాడిపల్లి, రాంపూర్ గ్రామాల్లో ధాన్యం తడిసింది.

● వేములవాడ టౌన్: మండలంలో శుక్రవారం భారీ ఈదురుగాలులతో కురిసిన వర్షానికి చెట్టు విరిగి రోడ్డుపై పడింది. వేములవాడ మండలం ఆరెపల్లి సమీపంలోని పెట్రోల్‌బంక్ సమీపంలోని తుమ్మచెట్టు విరిగి రోడ్డుపైన పడింది. ఆ సమయంలో రోడ్డుపైన వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్టు కరీంనగర్-వేములవాడ ప్రధాన రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

● కోనరావుపేట: మండలంలో కురుస్తున్న వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. లారీల కొరతతో ధాన్యం తరలించడంలో జాప్యం జరుగుతోంది. అకాల వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది.

● ధర్మారం: మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురిసింది. రోడ్లన్నీ బురదమయమయ్యాయి. వర్షం కారణం గా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

● మంథని/మంథని రూరల్: మండలంలో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి మార్కెట్ యార్డులో, వివిధ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో అమ్మకానికి పోసిన ధాన్యం తడిసింది. మండలంలోని ఆరెంద, వెంకటాపూర్, మల్లారంతో పాటు పలు గ్రామాల్లో ఇంకా కోయని పొలాలు నేలకొరిగాయి. ఖానాపూర్ గ్రామంలో గాలి దుమారానికి ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలు తెగిపడడంతో అమ్మకుంటి సమ్మయ్య అనే రైతుకు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి.

● కళ్యాణ్‌నగర్: గోదావరిఖనిలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. శుక్రవారం తెల్లవారు జామున 4గంటల వరకు కురిసింది. భారీ వర్షంతో రామగుండంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు 2.5సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.


మెట్‌పల్లి మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం


ధర్మారంలో ధాన్యం కుప్పలపై కప్పిన టార్పాలిన్లు


వేములవాడ మండలం ఆరెపల్లిలో రోడ్డుపై విరిగి పడిన తుమ్మచెట్టు


రుద్రంగిలో ధాన్యం కుప్పలు చూట్టూ చేరిన వర్షపు నీరు

పూర్తి స్థాయిలో పనులు కల్పించాలి

● ఉపాధి కూలీల ఆందోళన


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిషన్

కోరుట్ల రూరల్, మే 17: తమకు పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలు శుక్రవారం ఆందోళనకు దిగారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలు మాట్లాడుతూ గ్రామ శివారులోని నర్సింహులకుంట, బూర్గం కుంటల మాటు కాల్వల పూడికతీతతో పాటు ఇతర పనులను చేస్తుండగా ఆ ప్రాంతం లోని రైతులు అడ్డుకుంటున్నారన్నారు. దీంతో తాము పని దినాలను కోల్పోతున్నామని, ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తెచ్చేందుకే ఆందోళనకు దిగామన్నారు. తహసీల్దార్ కిషన్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. చేయవలసిన పనుల కోసం సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసి పనులు కల్పిస్తామని తెలపడంతో కూలీలు ఆందోళన విరమించారు.

పాత కక్షలతో దాడి: ఇద్దరి మృతి


శ్రీనివాస్, మహేష్ (ఫైల్)

బుగ్గారం మే 17: జగిత్యాల జిల్లా బుగ్గారం మండలంలో పాత కక్షలు పురి విప్పాయి. పాత పగలు మనసులో పెట్టుకుని మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన దిటి శ్రీనివాస్(36), దీటి మహేష్ (38)పై అదే గ్రామానికి చెందిన బుర్ర నవీన్‌తో పాటు కొంత మంది కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో శ్రీనివాస్, మహేష్ మృతి చెందారు. ఎస్సై శ్రీధర్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్ర నవీన్, దీటి శ్రీనివాస్ పక్క పక్క ఇళ్లలో నివసిస్తుంటారు. ఆ రెండు ఇళ్ల మధ్యలో ఉన్న ఇంటిని రెండేళ్ల క్రితం శ్రీనివాస్ కొన్నాడు.

ఆ ఇల్లు తనకు కావాలంటూ నవీన్ తరచూ శ్రీనివాస్‌తో గొడవ పడేవాడు. ఇదే విషయమై గ్రామం లో పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. ఇది మనసులో పెట్టుకున్న నవీన్ మరి కొందరితో కలిసి గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఇంటి బయట పడుకున్న శ్రీనివాస్‌తో పాటు అతని బంధువు దీటి మహేష్‌లపై కర్రలతో దాడి చేశాడు. శ్రీనివాస్, మహేష్ అరుపులకు ఇరుగు పొరుగు వారు రావడంతో నిందితులు ఘటనా స్థలం నుంచి పారిపోయారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలతో కొట్టుమిట్టాడుతున్న మహేష్‌ను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మహేష్ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. దీటి శ్రీనివాస్‌కు వివాహం జరిగింది. మహేష్‌కి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. శ్రీనివాస్ చెల్లెలు మమత పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

● హెచ్‌సీఏ, కేడీసీఏ ఆధ్వర్యంలో క్రికెట్ శిక్షణ ● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు చోట్ల శిబిరాలు

● పాల్గొంటున్న 500 మంది క్రీడాకారులు



కరీంనగర్‌లో క్రికెట్ శిక్షణ పొందుతున్న బాలికలు, బ్యాటింగ్ చేస్తున్న బాలుడు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 17: వేసవి సెలవుల్లో క్రికెట్ శిక్షణపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సౌజన్యంతో కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు కేంద్రాల్లో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు. కేడీసీఏ ఆరు సంవత్సరాలుగా శిక్షణ శిబిరాలు నిర్వహించలేదు. ఈ యేడాది హెచ్‌సీఏ, కేడీసీఏ శిబిరాలను నిర్వహిస్తుండడంతో విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, గోదావరిఖని, సిరిసిల్లలో శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నారు.

నిష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇస్తుండడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 500 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. అండర్- 14, అండర్-16, అండర్-19, అండర్-23 వయసు విభాగాల్లో బాలబాలికలకు వేర్వేరుగా ఉదయం 5 నుంచి 8.30 వరకు శిక్షణ ఇస్తున్నారు. కరీంనగర్‌లో వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎదుట ఉన్న జిల్లా క్రికెట్ సంఘం మైదా నంలో, సెయింట్ అల్ఫోన్స్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నారు. గోదావరిఖనిలోని జీఎం గ్రౌండ్‌లో, సిరిసిల్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నారు. అత్యధికంగా గోదావరిఖనిలో 200 మంది క్రీడాకారులు శిక్షణ పొందుతుండగా కరీంనగర్‌లో 160 మంది, సిరిసిల్లలో 140 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారు. క్రీడాకారులకు మూడు శిక్షణ కేంద్రాల్లో శిక్షణ అనంతరం హెచ్‌సీఏ సౌజన్యంతో అరటి పండ్లు, కోడి గుడ్లు, హెల్త్ డ్రింక్స్ అందిస్తున్నారు. కరీంనగర్‌లో డి.శ్రీనివాస్, పన్యాల శ్రీనాథ్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, మరో ముగ్గురు కోచింగ్ ఇస్తున్నారు. గోదావరిఖనిలో కిరణ్, సుదేశ్‌కుమార్, సిరిసిల్లలో ప్రసాద్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

● శిబిరాలను సందర్శించిన హెచ్‌సీఏ కమిటీ

ఇటీవల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కమిటీ సభ్యులు ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న క్రికెట్ శిక్షణ శిబిరాలను సందర్శించారు. హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు కార్యదర్శి, కోశాధికారి, ఉపాధ్యక్షులు ఈ కమిటీలో ఉన్నారు. రాష్ట్రంలో క్రికెట్ క్రీడాభివృద్ధికి, క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి గ్రామీణ స్థాయిలో క్రీడాకారుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికి తెచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.

● శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- వి ఆగంరావు, కేడీసీఏ అధ్యక్షుడు



హెచ్‌సీఏ సహకారంతో కేడీసీఏ నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు, ఔత్సాహిక యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిబిరాల్లో శిక్షణకుకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంటాయి. గ్రామీణ ప్రాంతంలోని అత్యుత్తమ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ఈ శిబిరాలు దోహదపడతాయి.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ధర్నా

● రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించిన అన్నదాతలు

● అధికారుల హామీతో ధర్నా విరమణ





రాయికల్-మైతాపూర్, కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

రాయికల్, మే 17: ధాన్యం కొనుగోలు జాప్యంతో పాటు తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించకపోవడంతో రాయికల్-మైతాపూర్ రోడ్డులో రైతులు రెండు గంటల పాటు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సొసైటీ కొనుగోలు కేంద్రం నిర్లక్ష్యంతో రోడ్డుపైకి రావాల్సి వస్తుందని, కేవలం ఆరుగురు హమాలీలతో ధాన్యాన్ని తూకం వేస్తున్నారని, తూకం వేసిన ధాన్యాన్ని లారీల కొరత ఉందంటూ మిల్లుకు తరలించకపోవడంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంట అకాల వర్షంతో తడిసిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగే వర్షాలు కురిసి ధాన్యం తడిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవోను ప్రశ్నించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల జాప్యంతో ప్రైవేట్ వ్యక్తులకు ధాన్యం విక్రయించాల్సి వస్తోందని, త్వరగా కొనుగోళ్లు చేపట్టాలని సొసైటీ అధికారులకు అనేకసార్లు మొర పెట్టుకున్నా స్పందన లేకపోవడంతో ప్రతి సంవత్సరం రోడ్డు ఎక్కాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వేగంగా కొనుగోళ్లు జరిపి ధాన్యాన్ని వెంటనే మిల్లుకు తరలించే ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. రైతుల ఆందోళన సమాచారంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మయ్య, ఏఎస్సై దేవేందర్ పది రోజుల్లో కల్లాల వద్ద నుంచి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని సీఈవోకు సూచించి రైతులకు నచ్చజెప్పడంతో నిరసనను విరమించారు. రైతుల ధర్నాతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి.

● వేములవాడ మండలం అనుపురంలో..

వేములవాడ టౌన్: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి రోజులు గడుస్తున్న కొనుగోలులో జాప్యం చేస్తున్నారని వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారిపై బైఠాయించారు. నాంపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో అనుపురం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 20 రోజులుగా కొనగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే రెండుసార్లు వర్షానికి తడిసాయని, ఇప్పటికి ధాన్యం కొనుగోలు చేయకోవడంతో గ్రామానికి చెందిన రైతుల ధాన్యం బస్తాలతో సుమారు గంటపాటు రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి రోడ్డుపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న వేములవాడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీచ్చారు. దీంతో రైతులు శాంతించి ధర్నాను విరమించారు.

● నాంపల్లి ప్రాథమిక సహకార సంఘం పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు ధాన్యం కొనగోళ్లు చేస్తున్నామని, అనుపురం గ్రామంలో 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయని ఇక్కడి బీఆర్ఎస్ నాయకులు కావాలని రాజకీయం చేస్తున్నారని సింగిల్ విండో ఛైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి ఆరోపించారు. అనుపురం రైతులు ధర్నా చేశారని తెలుసుకున్న సల్మాన్‌రెడ్డి అనుపురం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

ఘనంగా గంగాదేవి బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గంగపుత్రులు

రాయికల్, మే 17: మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని పెద్ద చెరువు గట్టు మీద నెలకొన్న గంగాదేవి ఆలయంలో శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పురోహితులు చెరుకు మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగాశివుని కల్యాణోత్సవం కోసం హోమం నిర్వహించారు. చెరువులను కాపాడుకోవడమే గంగమ్మ ఉత్సవాల ప్రత్యేక అని వారు తెలిపారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కామని రజనీ కుమార్, కార్యదర్శి హరీష్ కుమార్, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాశ్, సభ్యులు మాసపేట మల్లయ్య, వెంకట్రాజం, కామని లక్ష్మయ్య, సూర్యప్రకాశ్, రాజేశం, భూమరాజం, నరేష్, రమేష్, అరవింద్, ప్రభాస్, రాజ్ కుమార్, చిన్న నర్సయ్య, గంగాధర్, మురళి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, మే 17: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మొదటి దఫా అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ ద్వారా 100 రూపాయల రిజిస్ట్రేషన్‌తో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఐటీఐ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను ఈ నెల 16 నుంచి జూన్ 10వరకు స్వీకరించడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేరెళ్లలో మూడిళ్లలో చోరీ

ధర్మపురి, మే 17: మండలంలోని నేరెళ్ల గ్రామంలో గురువారం అర్ధరాత్రి మూడిళ్లలో చోరీ జరిగింది. గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు కంతి మహేష్ ఇంటిలో ప్రవేశించి రూ 2.35 లక్షలు నగదు, కంతి నరేష్ ఇంటిలో తులంనర బంగారు ఆభరణాలు, బొనగంటి రాజవ్వ ఇంటిలో 20 తులాల వెండి, అర తులం బంగారం, ఐదు వేలు నగదును అపహరించారు. రాత్రి వేళలో ఆ ముగ్గురు వ్యక్తులు ఇంటిలో పడుకుని ఉన్న సమయంలో వచ్చిన వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు.

ఫిట్స్‌తో మతిస్థిమితం లేని మహిళ మృతి



పొన్నం కవిత (ఫైల్)

వేములవాడ టౌన్, మే 17: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లిలో శుక్రవారం తెల్లవారుజామున ఫిట్స్‌తో మతిస్థిమితం లేని మహిళ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామానికి చెందిన పొన్నం కవిత (36) అనే మహిళకు మతిస్థిమితం కోల్పోయి ఇంట్లోనే వుంటుంది. నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి పారిపోయిన కవిత ఫిట్స్‌తో నాంపల్లి గ్రామంలో మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలికి మతిస్థిమితం సరిగా ఉండదని, ఫిట్స్, మూర్ఛ వ్యాధితో బాధపడుతుందని కుటుంబ సభ్యుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు చోట్ల ఆటో బోల్తా : ఇద్దరు డ్రైవర్ల మృతి



చెలకని రాజు(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 17: పెద్దపల్లి జిల్లాలోని కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి మండలంలో ఆటో బోల్తా పడి ఇద్దరు డ్రైవర్లు మృతిచెందారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఏదులాపూర్-పెద్దరాతుపల్లి గ్రామాల మధ్యన ఉన్న మట్టలవాగు బ్రిడ్జివద్ద ఆటో బోల్తాపడి ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన చెలకని రాజు(30) అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో మహిళకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఓదెల మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన చెలకని రాజు, బీస రజిత కాల్వశ్రీరాంపూర్ మండలంలోని ఏదులాపూర్‌లో గురువారం జరిగిన వారసంతలో కూరగాయలు అమ్ముకొని స్వగ్రామానికి బయలుదేరారు. అర్ధరాత్రి పెద్దరాతపల్లి మట్టల వాగు బ్రిడ్జి వద్ద ప్రమాదావ శాత్తు ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రాజు అక్కడిక్కడే మృతి చెందగా, రజితకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి ఎస్ఐ ఓంకార్ యాదవ్ చేరుకొని ప్రమాద వివరాలు తెలుసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రాజుకు భార్య భవాని, కూతురు, కొడుకు ఉన్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దపల్లి రూరల్: మండలంలోని పాలితం గ్రామానికి చెందిన ఆలేటి భూమయ్య (42) ఆటోడ్రైవర్ ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడి మృతిచెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆటో నడుపుతూ జీవనం సాగించే భూమయ్య శుక్రవారం యథావిధిగా పాలితం గ్రామం నుంచి పెద్దపల్లికి ప్యాసింజర్‌లను తీసుకోచ్చి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో పాలితం గ్రామ శివారులో ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడటంతో ఆటోలో ఉన్న డ్రైవర్ భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆటోలో ప్రయాణికులు ఎవరూ లేరని తెలిపారు. మృతుడి భార్య జయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్ రావు తెలిపారు.

బిల్లుల కోసం గ్రామ పంచాయతీకి తాళం

గంభీరావుపేట, మే 17: అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్ గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. గంభీరావుపేట మండలం కోళ్లమద్ది మాజీ సర్పంచ్ ఏనుగు కేశవరావు ఈజీఎస్ పథకం కింద గ్రామ పంచాయతీ భవనం మంజూరవడంతో రూ.20 లక్షలతో నిర్మించారు. మరో ఎనిమిది లక్షల రూపాయలను గ్రామాభివృద్ధికి వెచ్చించారు. ఇప్పటి వరకు బిల్లులు రాకపోవడంతో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వకుండా సర్పంచులను నిర్లక్ష్యం చేశాయని మండిపడ్డారు. సర్పంచుల గౌరవ వేతనం కూడా మూడు సంవత్సరాలది పెండింగ్‌లో ఉన్నదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఐదు నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులుగానీ, సర్పంచుల పెండింగ్ బిల్లులు గానీ విడుదల చేయలేదన్నారు. బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

సౌత్ ఆఫ్రికాలో కొత్తపేట వాసి మృతి

ఎండపల్లి, మే 17: ఉపాధి నిమిత్తం సౌత్‌ఆఫ్రికా వెళ్లిన మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన వ్యక్తి అక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగట్టు సత్తయ్య(43) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం సౌత్ ఆఫ్రికాకు వెళ్లాడు. 20 నెలల క్రితం ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి గడిపాడు. ఇటీవలే మళ్లీ వెళ్లాడు. శుక్రవారం ఉదయం గుండెపోటు రావడంతో అక్కడి గదిలోనే మృతి చెందాడు. సత్తయ్య సోదరుడు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తెలిపాడు. సత్తయ్యకు భార్య పద్మ, కొడుకు, కూతురు ఉన్నారు.

కొండగట్టులో కానరాని 'క్యాష్ లెస్' సేవలు

● మూలన పడ్డ స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ బోర్డులు

● అసౌకర్యానికి గురి అవుతున్న భక్తులు



ఆలయంలో ఓ మూలన ఉన్న క్యూఆర్ కోడ్ బోర్డు

మల్యాల, మే 17: ఆన్‌లైన్ సేవల కాలమైన నేటి రోజుల్లో ప్రజలు అత్యధికంగా 'క్యాష్ లెస్' లావాదేవీపై ఆధారపడగా ప్రతీ చోట క్యాష్‌లెస్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే కొండగట్టు అంజన్న క్షేత్రంలో మాత్రం భక్తులు క్యాష్‌లెస్ సేవలకు నోచుకోవడం లేదు. దీంతో భక్తులు డబ్బుల కోసం కొండపైన తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అయిదేళ్ల క్రితం దేవస్థానం అధికారులు స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ స్కానర్‌సిస్టంను అందుబాటులోకి తీసుకువచ్చారు. కొన్నేళ్ల క్రితం కార్డులు ఎక్కువ వినియోగించగా వాటి కోసం స్వైపింగ్ యంత్రాలను దేవస్థానం పరిధిలోని బుకింగ్ తదితర చోట్ల ఏర్పాటు చేశారు. అయితే అవి ముణ్నాళ్లకే అటకెక్కాయి. కాగా ఇటీవల యూపీఐ లావాదేవీలు పెరుగడంతో రెండేళ్ల క్రితం ఆలయంలో భక్తులు స్వామి వారికి చెల్లించుకునే కానుకలను సమర్పించడానికి గాను క్యూఆర్ కోడ్ స్కానర్ బోర్డులు పెట్టారు. అవి కూడా ఇటీవల మూలనపడ్డాయి. దీంతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆన్‌లైన్ సేవల్లో భాగంగా నగదు రహిత లావాదేవీల నిర్వహణకు ఏర్పాటు చేసిన స్వైపింగ్ యంత్రాలు, క్యూఆర్ కోడ్ బోర్డుల నిర్వహణ కొరవడడం, అవి పని చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పట్టణాలు, నగరాల నుంచి వచ్చే భక్తుల ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. నగదురహిత సేవలకు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతన్నారు.

● ఉచిత వైఫై మేలు..

కొండగట్టు కొండపైన సెల్‌ఫోన్ సేవలు నామమాత్రమే. ఇక్కడ సెల్‌ఫోన్ సేవలను విస్తృతంగా అందించేందుకు సెల్ సంస్థలు ముందుకు రాకపోవడంతో అంతంత మాత్రమే అందుతున్న సెల్ సేవలతో ఇబ్బందులు పడుతున్న భక్తులు.. క్యాష్‌లెస్ సేవలకూ సెల్‌సేవలు విఘాతంగా మారుతున్నాయి. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు ఉచిత వైఫై సేవలపై దృష్టి సారించాలని పలువురు భక్తులు కోరుతున్నారు. దేవస్థానానికి కోట్లాదిగా ఆదాయం భక్తుల ద్వారా వివిధ మార్గాలో సమకూరుతుండగా పలు టికెట్లు, ప్రసాదాలు, వాహన పూజలు తదితర వాటి ద్వారా నగదు లావాదేవీలు జరుగుతుంటాయి. అధికారులు నగదురహిత సేవల కోసం ఉచిత వైఫై సమకూర్చే అవకాశం మెండుగా ఉన్నా అటువైపుగా దృష్టి సారించడం లేదు.

● చర్యలు తీసుకుంటాం

చంద్రశేఖర్, ఆలయ ఈవో

కొండగట్టులో భక్తులకు క్యాష్‌లెస్ సేవలు అందించడానికి గాను తగుచర్యలు తీసుకుంటాం. యూపీఐ సేవలు అందుబాటులో తీసుకురావడంపై దృష్టి సారిస్తం. సెల్‌సేవలు అందించే సేవలు అందుబాటులో లేకపోవడంతో ఉన్నపాటి కొద్ది సిగ్నల్స్ క్యాష్‌లెస్ సేవలకు అందక ఆన్‌లైన్ సేవలకు అసౌకర్యంగా మారుతోంది. దీంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కోనే పరిస్థితి నెలకొంటుంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మంథని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్





మాట్లాడుతున్న డా. శ్రీధర్, బెస్ట్ స్టూడెంట్ అవార్డు అందిస్తున్న ప్రిన్సిపాల్

కొడిమ్యాల, మే 17: ఇంజనీరింగ్ విద్యార్థులు లక్ష్య సాధనతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మంథని జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాచుపల్లి జేఎన్ టీయూ ఇంజనీరింగ్ కళాశాల 16వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ విద్యార్థులు క్లాస్‌లకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవటానికి కమ్యూనికేషన్స్ నైపుణ్యతను మరింత పెంచుకోవాలన్నారు.

అంతకు ముందు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.. టి. వేణుగోపాల్ ప్రారంభ ఉపన్యాసంతో వేదికపైకి అందరిని ఆహ్వానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా. కామాక్షిప్రసాద్ మాట్లాడుతూ జేఎన్‌టీయూ కళాశాల 2023-2024 నుంచి పదేళ్ల పాటు అటాన మస్ ప్రతిపత్తి పొందిందన్నారు. కళాశాలలో చేసిన అభివృద్ధిని ఈ సందర్భంగా వివరించారు. అనంతరం అకాడమిక్ ప్రైజెస్, స్పోర్ట్స్ గేమ్స్ ప్రైజెస్ అందించారు. యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్ సాధించిన నలుగురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. బెస్ట్ స్టూడెంట్ అవార్డు సాధించిన జి తేజస్వినికి ప్రశంసా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వివిద విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడి మృతి



కర్రోళ్ల రాజు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 17: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామ శివారులో శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనం అదుపు తప్పిన సంఘటనలో గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బీఎస్పీ మాజీ మండల అధ్యక్షుడు కర్రోళ్ల రాజు (38) అనే యువకుడు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడని ఎస్ఐ రమాకాంత్ తెలిపారు. చీకటి పడడం వల్ల ఎవరూ గమనించకపోవడంతో ఆయన మృతదేహం ఎనిమిది గంటల పాటు ఘటన స్థలంలోనే పడి ఉందని పేర్కొన్నారు. ఆయన కథనం మేరకు.. గంభీరావుపేట మండలం నర్మాలకు చెందిన రాజు తన బైక్‌పై ఈ నెల 16న సాయంత్రం ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామానికి వచ్చా డు. తిరుగు ప్రయాణంలో రాత్రి మండలంలోని కోరుట్లపేట శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దాంతో రాజు ఎగిరిపోయి పక్కనే ఉన్న వ్యవసాయ భూమిలో పడి మృతి చెందాడు. ఉదయం పొలాల వద్ద కు వెళ్లిన రైతులకు మృతదేహం కనిపించడంతో సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తించి నర్మాలకు చెందిన రాజుగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు రాజు తల్లి ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు. మృ తుడికి భార్య లక్ష్మీ, కూతురు ఉన్నారు. రాజు కొంత కాలంగా బీఎస్పీ పార్టీలో చురుకైన నాయకుడిగా కొనసాగుతు న్నాడు. రెండు పర్యాయాలు బీఎస్పీ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. రాజు మృతిపై బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు స్వామి, నాయకులు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

దాడి ఘటనలో నిందితుల అరెస్ట్

రామడుగు, మే 17 : తమ్ముళ్లపై దాడి చేసిన అన్న, అతని కుమారుడిని శుక్రవారం అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ప్రకాశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని దత్తోజీపేట గ్రామానికి చెందిన తోట్ల రాములు, తోట్ల మల్లయ్య, తోట్ల ముత్తయ్య ముగ్గురు అన్నదమ్ములు కాగా గత కొంత కాలంగా వ్యవసాయ భూమిపై గొడవలు జరుగుతున్నాయి. అందులో బాగంగా గురువారం రాత్రి గ్రామ శివారులో ముత్తయ్య, మల్లయ్యలు మోటార్ సైకిల్‌పై వెల్లుతుండగా అన్న రాములు, అతని కుమారుడు తోట్ల మహేందర్‌లు కర్రలతో దాడికి పాల్పడగా గాయాల పాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. మల్లయ్య కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

గోదావరిఖనిలో తల్లీకూతుర్ల అదృశ్యం

కోల్‌సిటీ, మే 17: గోదావరిఖని భరత్‌నగర్‌కు చెందిన దాసారపు రజిత(23) అనే వివాహిత, ఆమె కూతురు అనన్య (21నెలలు)ను తీసుకుని గురువారం ఉదయం నుంచి అదృశ్యమైనట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. భార్యభర్తల మధ్య గొడవ జరుగగా మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయిందన్నారు. ఆమె తల్లి సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ ని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ 8712656516, ఎస్ఐ టీ శ్రీనివాస్ 9010072555కి సమాచారం ఇవ్వాలని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి కోరారు.

అధిక లోడు.. అవస్థలు చూడు!



అధిక లోడుతో వెళుతున్న లారీకి అడ్డు తగిలిన తీగలు

ఎల్లారెడ్డిపేట, మే 17: అసలే కిందకు వేలాడుతున్న తీగలు.. భారీ వాహనాలు వెళితే మరో వాహనం ప్రయాణించేందుకు కష్టంగా ఉన్న రోడ్డు.. ధాన్యం బస్తాలు నింపుకుని అధిక లోడుతో వెళుతున్న లారీకి కరెంటు స్తంభాల నుంచి ఇళ్లకు వెళ్లే విద్యుత్తు సర్వీస్ తీగలు అడ్డు తగిలాయి. అడుగడుగునా తీగలు అడ్డురావడంతో లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపి పైకెక్కి తీగలను సరి చేసి మళ్లీ ముందుకు సాగాడు. ఎల్లారెడ్డిపేట మండలంలోని మొదటి బైపాస్ రోడ్డులో అధిక లోడుతో ప్రయాణిస్తున్న లారీ వల్ల శుక్రవారం రాకపోకలు నిలిచిపోయాయి. వాహనదారులు లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక లోడుతో భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల తమ ఇళ్ల సరఫరా అయ్యే విద్యుత్తు సర్వీస్ తీగలు తెగిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా బైపాస్ రోడ్డు వెంట అధిక లోడుతో వచ్చే వాహనాలను అనుమతించకూడదని కోరుతున్నారు.



తీగలను తీసేందుకు ఇబ్బంది పడుతున్న వాహన డ్రైవర్

బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులకు తప్పిన ప్రాణాపాయం

ఎండపల్లి, మే 17: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఆర్టీసీ బస్సును వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. బస్సులో ఉన్న దాదాపు వంద మందికి ప్రాణాపాయం తప్పింది. ప్రయాణికులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. కరీంనగర్ నుంచి మంచిర్యాలకు వెళుతున్న టీఎస్ 02 యూఏ 3672 అనే నంబర్ గల బస్సు మండలంలోని కొత్తపేట గ్రామానికి రాగానే వెనుక నుంచి వస్తున్న లారీ ఆటోను తప్పించబోయి బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఒకేసారి పెద్ద శబ్దం రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడ్డారు. ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు వచ్చి పరిశీలించారు.

గంభీరావుపేటలో విషాదం

గంభీరావుపేట, మే 17: ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం గంభీరావుపేట మండలంలో విషాదం అలుముకుంది. గంభీరావుపేట మండలం నర్మాల గ్రామానికి చెందిన బీఎస్పీ నేత కర్రోల్ల రాజు కోరుట్లపేట రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడు రాజు అనేక సమస్యలపై ప్రజలతో కలిసి ఉద్యమించాడు. బీఎస్పీ మండల శాఖ అధ్యక్షుడిగా చాలాకాలం పనిచేశాడు. కర్రోల రాజు ఆకస్మిక మరణం తన సొంత గ్రామమైన నర్మాలతో పాటు మండల వ్యాప్తంగా విషాద చాయలు చోటు చేసుకున్నాయి. బీఎస్పీ శ్రేణులు, స్నేహితులు, బంధువులు, పలు రాజకీయ పార్టీల నాయకులు ప్రజలు రాజు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

పూర్ణాహుతి.. సహస్ర కలశాభిషేకం

- కొనసాగుతున్న నరసింహ నవరాత్రోత్సవాలు - స్వామి వారలను దర్శనం చేసుకున్న భక్తులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



అభిషేకం కోసం కలశం తీసుకెళ్తున్న ఆలయ ముఖ్య అర్చకులు

ధర్మపురి, మే 17: ధర్మపురి క్షేత్రంలో ఐదో రోజు శుక్రవారం నరసింహ నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఉదయం వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేక పూజలు, సహస్ర కలశాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనాది ఆరాధన, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండలి, స్థాపిత దేవతా పూజలు అనంతరం స్వామివారికి సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. లోక క్షేమార్థం యాగశాల వద్ద అర్చకులు హోమం నిర్వహించారు. స్వామి వారలను అందంగా అలంకరణ చేశారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతి ధ్వనించాయి. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, డీసీఎంఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, చిలుకముక్కు రమణాచార్యా, నరసింహమూర్తి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది పిల్లలకు వేసవి శిబిరం

కరీంనగర్ క్రైం, మే 17: పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని జాన్ విల్సన్ ఓపెన్ ఎయిర్ థియేటర్‌లో పోలీస్ సిబ్బంది పిల్లలకు వేసవి శిబిరాన్ని శుక్రవారం పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ వేసవి శిబిరం రెండు వారాలపాటు కొనసాగుతుందని సీపీ తెలిపారు. ఈ శిబిరంలో పిల్లలకు డ్రాయింగ్, పెయింటింగ్, డాన్స్, పాటలు, అథ్లెటిక్స్, కరాటే, ఫుట్‌బాల్, క్రికెట్ వంటి వాటిల్లో శిక్షణ ఇప్పిస్తున్నామని, శిక్షణ కోసం సుశిక్షితులైన టీచర్లను, కోచ్‌లను నియమించామన్నారు. పిల్లలకు చదువులతో పాటు ఆటలకు కూడా ప్రాధాన్యతనిచ్చేలా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. ఆటల వలన మానసికోల్లాసమే కాకుండా శారీరక ధృడత్వంతో పాటు ఆత్మవిశ్వాసమూ పెంపొందుతుందన్నారు. పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(శాంతి భద్రతలు) ఏ లక్ష్మీనారాయణ, ఆర్ఐలు సురేష్(అడ్మిన్), శ్రీధర్‌రెడ్డి(వెల్ఫేర్) పాల్గొన్నారు.

మెడికో హెల్త్‌కేర్‌కి ఎంపికైన శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి

గణేశ్‌నగర్,మే 17: మంకమ్మతోటలోని శ్రీ చైతన్య డిగ్రీ,పిజీ కళాశాలలో మెడికో హెల్త్‌కేర్ సర్వీస్ కంపెనీ వారు మంగళవారం నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్ కి విశేష స్పందన లభించిందని కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 110 మంది చివరి సంవత్సరం విద్యార్థులు పాల్గొన్న ఈ ఇంటర్వ్యూలో వివిధ దశలలో జరిగిన ఎంపిక ప్రక్రియలో 21 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, వారికి వార్షిక వేతనం 2.5 లక్షలు ఉంటుందని తెలిపారు, విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా తమ సంస్థ పనిచేస్తుందని, ప్రతి విద్యా సంవత్సరంలో దాదాపు 100 మంది శ్రీ చైతన్య డిగ్రీ విద్యార్థులు బహుళ జాతి సంస్థలకు ఎంపికవడమే దీనికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్,డా:ఎల్ శ్రీనివాస్, డా వి స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ కృష్ణారెడ్డి కళాశాల సిబ్బంది , కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరంతర నీటి సరఫరాకు ఏర్పాట్లు పూర్తి చేయండి

● మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్

కరీంనగర్ టౌన్, మే 17: నగరంలోని హౌసింగ్‌బోర్డు రిజర్వాయర్ పరిధిలో నిరంతర మంచినీటి సరఫరాకు ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి హౌసింగ్‌బోర్డు కాలనీ రిజర్వాయర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా తాగునీటి సరఫరా జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా నగర ప్రజలకు తాగునీటిని అందించాలని అన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంట వెంటనే పరిష్కరించాలన్నారు. మే నెలాఖరులోగా నిరంతర నీటి సరఫరాకు అవసరమైన చర్యలన్నీటిని పూర్తి చేయాలని ఆదేశించారు.

పీఎఫ్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న డాక్టర్ డాక్టర్ ప్రతిష్ఠారావు

సుభాష్‌నగర్, మే 17: అనేక అనారోగ్య సమస్యలకు హైపర్‌టెన్షన్ కారణమని మెడికవర్ వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ ప్రతిష్ఠారావు అన్నారు. శుక్రవారం వరల్డ్ హైపర్ టెన్షన్ డే సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రీజినల్ పీఎఫ్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం, హెల్త్‌టాక్‌తో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఇకో పరీక్షలను నిర్వహించారు. ప్రతి రోజు వ్యాయామం, మెడిటేషన్ చేస్తూ, ఒత్తిడి లేకుండా జీవించడం వల్ల బ్లడ్‌ప్రెషర్ అదుపులో ఉంచవచ్చన్నారు. పీఎఫ్ కమిషనర్ తానయ్య మాట్లాడుతూ వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. వైద్యుడు డాక్టర్ సత్యనారాయణ, మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, మే 17: నగరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగింపులో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టౌన్ వన్, టూ ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు 33/కెవి, సుభాష్‌నగర్ ఫీడర్, 33/11కెవి వావిలాలపల్లి, బ్యాంక్ కాలనీ, వాటర్ వర్క్స్ హౌసింగ్ బోర్డు, సుబాస్‌నగర్, 33/11కెవి సబ్‌స్టేషన్, ఉజ్వల పార్క్,33/11కెవి, సబ్‌స్టేషన్ సప్తగిరి కాలనీ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. 11/కేవీ సంతోష్‌నగర్ ఫీడర్‌లో కొత్త లేబర్ అడ్డా, సెయింట్ జాన్ స్కూల్ ఏరియా, శివ థియేటర్ ఏరియా, భాగ్య నగర్, జ్యోతి నగర్ ఏరియా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించగలరని వారు కోరారు.

● హుజూరాబాద్‌లో..

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంతో పాటు బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని టౌన్ ఏఈ శ్రీనివాస్ కోరారు.


● జమ్మికుంట మండలంలో..

జమ్మికుంట రూరల్: ఆబాది జమ్మికుంట, మాచనపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాతాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సర్వేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోత్కులగూడెం, మారుతినగర్, హౌసింగ్‌బోర్డు, దుర్గాకాలని, అంబేద్కర్‌కాలనీ, పాత మార్కెట్, మసీద్, కృష్ణాకాలనీ, ఎంప్లాయీస్ కాలనీ, టీచర్స్ కాలనీ, కొత్త మార్కెట్, ఆర్టీసీ బస్టాండ్, గాంధీ చౌరస్తా, వీణవంక రోడ్, కొండూరి కాంప్లెక్స్, పద్మశాలి వీధి, ప్రభుత్వ ఆసుపత్రి, కేశవపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వారు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

● వీణవంక మండలంలో..

వీణవంక: మరమ్మతుల దృష్ట్యా మండలంలోని వీణవంక, పోతిరెడ్డిపల్లి, బేతిగల్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు మరమ్మతు పనులు చేపడుతున్నందున విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని ఆయన కోరారు.

గుండెపోటుతో రంగస్థల నటుడు మృతి



పొరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

హుజూరాబాద్ రూరల్, మే 17: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన రంగస్థల నటుడు, సీనియర్ కళాకారుడు పొరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (68) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి పెద్దపాపయ్యపల్లి గ్రామంలో మొట్ట మొదటిసారిగా శివరామకృష్ణ భజన మండలి స్థాపించి ఎంతో మంది కళాకారులను తయారు చేశారు. అలాగే హైద్రాబాద్‌లో నటరాజ్ కళాకారుల సంక్షేమ సంఘం స్థాపించి దానికి అధ్యక్షుడిగా పనిచేశారు. శ్రీనివాస్‌రెడ్డికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, కళాకారులు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

అడుగంటుతున్నా అందమే



మానేరు జలాశయం



మానేరు నీటిపై పక్షి



మానేరులో అలలు

మండుతున్న ఎండలతో లోయర్ మానేరు డ్యాంలో నీటి మట్టం తగ్గుతోంది. నీరు అడుగంటుతుండటంతో డ్యాంలోని ఇసుక తిన్నెలు తేలి ఐలాండ్స్‌లా కనువిందు చేస్తున్నాయి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్



ఆకట్టుకుంటున్న ఇసుక తిన్నెలు



ఆకట్టుకుంటున్న నీలి మేఘాలు

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

గణేశ్‌నగర్,మే 17: 2024-25 విద్యా సంవత్సరమునకు కరీంనగర్ జిల్లాలోని బెస్ట్ అవలేబుల్ స్కూల్స్ (రెసిడెన్షియల్ నాన్-రెసిడెన్షియల్)లలో 1వ తరగతి (నాన్-రెసిడెన్షియల్),5వ తరగతి (రెసిడెన్షియల్)లలో ప్రవేశము నిమిత్తము షెడ్యూల్డు కులముల విద్యార్థిని, విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డు కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు న్యాతనియల్ తెలిపారు. 1వ తరగతికి ప్రవేశములో (86) సీట్లు , 5వ తరగతికి (89) సీట్లు మొత్తం సీట్లు (175) కేటాయించినట్లు తెలిపారు. 1వ తరగతి (నాన్-రెసిడెన్షియల్) స్కీంలో ప్రవేశము పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి సౌకర్యము లేదన్నారు. 1వ తరగతి విద్యార్థుల వయసు 5 నుంచి 6 సంవత్సరాలలోపు (తేది: 1-6-2018 నుండి తేది: 31-5-2019 వరకు) ఉండాలన్నారు. 5వ తరగతి విద్యార్థులకు మాత్రమే హాస్టల్ వసతి సౌకర్యము ఉందన్నారు. ప్రవేశము కోరే విద్యార్థులు కరీంనగర్ జిల్లాకు చెందిన వారై, వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయము రూ. 1,50,000 లలోపు గ్రామ స్థాయిలో , రూ.2,00,000/-లోపు పట్టణ స్థాయిలో ఉండాలన్నారు. విద్యార్థులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

అగ్రికల్చర్ లేబర్ , మొదటి తరం అక్షరాస్యత కలిగిన కుటుంబాలకు మాత్రమే 50 శాతం,ఆనాధ పిల్లలకు 20 శాతం,జోగిని పిల్లలకు 15శాతం, బాండెడ్ పిల్లలకు 15 శాతం, ఒక కేటగిరీలో విద్యార్థులు లేనిచో మిగిలిన సీట్లు వేరొక కేటగిరి నుండి భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు శనివారం నుంచి లభిస్తాయని తెలిపారు. పూర్తి చేసిన ధరఖాస్తులను తగు ధ్రువీకరణ పత్రములతో కులము, ఆదాయము, అగ్రికల్చర్ లేబర్ (మీ సేవా ద్వారా పొందినవి) నివాస, రేషన్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రము (మున్సిపల్ కార్పోరేషన్/మున్సిపల్ బోర్డు/తహశీల్దాము ద్వారా పొందినవి) ఆధార్ కార్డు పత్రములతో తేది. జూన్ 6 సాయంత్రము 5 గంటలలోపు పైన తెలిపిన జిల్లా కార్యాలయములో సమర్పించవలెనని తెలిపారు.

నేడు వాసవీకన్యకాపరమేశ్వరి జయంతి ఉత్సవం

కరీంనగర్ కల్చరల్, మే 17: వైశాఖ శుద్ధ దశమి సందర్భంగా శనివారం అశోక్‌నగర్ వాసవీకన్యకాపర మేశ్వరి దేవాలయంలో ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొని తరించాలని చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉత్సవ వివరాలను ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమాల్లో భాగంగా అభిషేకం, మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, అష్టోత్తరశత వాసవీమాత పారాయణం, అనంతరం డోలోత్సవం, మహానైవేద్యం, తీర్థప్రసాద వితరణ, అన్నదానం జరుగుతాయని తెలిపారు. సాయంత్రం 6-30 గంటల నుంచి అమ్మవారి రథ శోభాయాత్ర పుర వీధు ల గుండా సాగుతూ ప్రకాశంగంజ్ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి చేరుకుంటుందని తెలిపారు.

సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్స్ ముందంజ

సుభాష్‌నగర్, మే 17: సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్స్ ప్రథమ స్థానంలో ఉన్నాయని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు, గ్యాట్ ఏరియా లీడర్ సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో తెలంగాణ, కర్నాటకలోని 8 జిల్లాల గవర్నర్లు, 8 జిల్లాల క్లబ్స్ కార్యవర్గాలతో మల్టికాన్ పేరుతో లయన్స్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ జిల్లా 320 వార్షిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాల్లోని వివిధ కంటి ఆసుపత్రుల ద్వారా అందించిన సేవలు, మీల్స్ ఆన్ వీల్స్ ద్వారా అన్నదాన కార్యక్రమం, సిటి స్కాన్ ఏర్పాటు ఇలా అనేక ప్రజా సేవా కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. 1917లో 20 మందితో ప్రారంభమైన లయన్స్‌క్లబ్ నేడు 208 దేశాలకు విస్తరించిందని తెలిపారు. ఈ మల్టీకాన్ మూడు రోజులపాటు జరుగుతుందని తెలిపారు. వసుధ కన్వెన్షన్‌లో వివిధ కార్యక్రమాల్లో భాగంగా క్లబ్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ నెల 19న అమరులైన లయన్స్ సభ్యులకు సంతాపం, వివిధ జిల్లాల డిజిల పరిచయం ఉంటుందన్నారు. 2024-25 సంవత్సరానికిగాను నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మెన్‌గా హన్మండ్ల రాజిరెడ్డి, వైస్ చైర్మెన్‌గా కె హరీష్‌రెడ్డి, కార్యదర్శిగా ఎన్ వెంకటేశ్వర్‌రావు, కోశాధికారిగా రేసు మల్లారెడ్డి, జాయింట్ సెక్రటరిగా శివప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ చైర్మెన్ తీగల మోహన్‌రావు, కాన్ఫరెన్స్ కార్యదర్శి అనంతుల శివప్రసాద్, సుద్దాల రామచంద్రం, కోదండరాములు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లపై సీడీఎంఏ, ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు

● అవినీతిపై చర్యలు తీసుకునే వరకు వదిలిపెట్టను

● బీఆర్ఎస్ కార్పొరేటర్ బండారి వేణు

కరీంనగర్ టౌన్, మే 17: నగరంలో కోట్లాది రూపాయల సీఎం హామీ, స్మార్ట్‌సిటీ నిధులతో చేసిన అభివృద్ధి పనుల్లో అవినీతి అక్రమాలు జరిగాయని, కాంట్రాక్టర్లు, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కై అంచనాలు పెంచి బిల్లులు చెల్లించి ప్రజాధనాన్ని దోచుకుతింటున్నారని 41వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్ బండారి వేణు ఒక ప్రకటనలో ఆరోపించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, కాంట్రాక్టర్లకు దొడ్డిదారిన సహకరిస్తూ కోట్ల రూపాయల అవినీతికి పాల్పడుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులపై జిల్లా కలెక్టర్, సీడీఎంఎ, విజిలెన్సు కమిషనర్‌తో పాటు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ (మున్సిపల్)కు ఫిర్యాదు చేశానని అన్నారు. తెలంగాణచౌక్‌లోని ఇందిరాజంక్షన్, హౌసింగ్‌బోర్డు జంక్షన్, బైపాస్ జంక్షన్ సుందరీకరణ పనులు, కిసాన్‌నగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం, వివిధ ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలలో జరిగిన అవినీతిపై తాను ఇప్పటికే ఫిర్యాదు చేశానని, దానిపై విజిలెన్సు అధికారులు స్పందించి ఓవైపు విచారణ జరుపుతుంటే మరోవైపు సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేశారని విమర్శించారు. ఈ అవినీతి కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపించి సబంధిత కాంట్రాక్టర్‌తోపాటు బాధ్యులైన ఇంజనీరింగ్ అధికారులపై చర్య తీసుకోవాలని కోరుతూ మరోసారి మున్సిపల్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని అన్నారు. పదిహేను రోజుల్లో విచారణ జరిపి బాధ్యులైన కాంట్రాక్టర్, వారికి సహకరించి బిల్లులు చెల్లించిన ఇంజనీరింగ్ అధికారులపై చర్య తీసుకోని పక్షంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తానని, కోట్ల రూపాయల అవినీతి కుంభకోణంపై చర్య తీసుకునే వరకు పోరాటం ఆపనని కార్పొరేటర్ వేణు తెలిపారు. మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకునే అవకాశాలుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

'జ్యోతిష్మతి'లో ఎంఎస్ కోర్స్‌పై వెబినార్



వెబినార్‌లో పాల్గొన్న విద్యార్థులు

తిమ్మాపూర్(మానకొండూర్), మే 17: మండలంలోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ విద్యార్థులకు అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఎస్ కోర్స్ అడ్మిషన్‌పై ఆన్‌లైన్ వెబినార్ కార్యక్రమం కళాశాలలో నిర్వహించారు. ఇటీవల లూసియానా టెక్ యూనివర్సిటీ, జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలకు మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా యూనివర్సిటీ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డైరెక్టర్ జె.ఆర్ లిగాన్, యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ఫర్ రిసెర్చ్ డీన్ ఆఫ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ప్రొఫెసర్ బి రాముచంద్రన్ వెబినార్‌లో మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఉన్నత విద్యలో భాగంగా అడ్మిషన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్కాలర్‌షిప్స్ ప్రాంగణ నియామకాలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సెప్టెంబరు, ఫిబ్రవరిలో నిర్వహించే అడ్మిషన్ల ప్రక్రియకు సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. ఏజెంట్లను సంప్రదించి ఇబ్బందులు పడకుండా విద్యార్థులు అమెరికాలో ఉన్నత విద్యను సులభంగా అభ్యసించేందుకు జ్యోతిష్మతి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల లూసియానా టెక్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయని వారు తెలిపారు. అంతేకాకుండా చదువుతో పాటు సంపాదించడానికి స్కాలర్‌షిప్‌లు, అసిస్టెంట్‌షిప్‌లను సురక్షితంగా పొందవచ్చని తెలిపారు.

లూసియానా టెక్ విశ్వవిద్యాలయం 1894 లో స్థాపించబడిందని ఇంజనీరింగ్, సైన్స్, వ్యాపార కార్యక్రమాలకు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. కార్యక్రమంలో జ్యోతిష్మతి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, కరస్పాండెంట్, సెక్రటరీ జువ్వాడి సుమిత్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్‌రావు, డీన్ అకాడమిక్స్ పి.కే వైవాలి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్పందన' విద్యార్థులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న జడ్పీటీసీ తదితరులు

జమ్మికుంట, మే 17: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లిలో గల స్పందన ఆనాథ శరణాలయం విద్యార్థులకు దాతలు అన్నదానం నిర్వహించారు. ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామానికి చెందిన పరకాల తిరుపతయ్యగౌడ్ నాలుగో వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు శుక్రవారం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్ శ్యామ్, మాజీ సర్పంచ్ ఎండీ రఫిఖాన్, గ్రామస్థులు హాజరయ్యారు.

ఈదురు గాలులకు లేచిపోయిన ఇంటి పైకప్పు



లేచిపోయిన ఇంటి పైకప్పు

మానకొండూర్, మే 17: మండలంలోని కొండపల్కల శివారు గ్రామమైన పాపయ్యబంజేరు పల్లిలో గురువారం అర్ధరాత్రి ఈదురు గాలులు, అకాల వర్షానికి ఇంటిపైకప్పు రేకులు లేచిపోయాయి. గురువారం సాయంత్రం నుంచి ఈదురుగాలులు తీవ్ర బీభత్సం సృష్టించడంతో గ్రామానికి చెందిన తోట ఎల్లమ్మ, తోట మధు ఇటీవల నిర్మించున్న రేకుల షెడ్లు పూర్తిగా లేచిపోయాయి. ఇంటిలోని బట్టలు, బియ్యం, ఇతర సామగ్రి పూర్తిస్థాయిలో తడిసి ముద్దయ్యాయి. రాత్రంత నిద్ర లేక రెండు కుటుంబాలు జాగారం చేశాయి. మండల అధికారులు తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

ఘనంగా బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు



ఆరాధనోత్సవల్లో పాల్గొన్న భక్తులు

హుజూరాబాద్, మే 17: హుజూరాబాద్ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరబ్రహ్మేంద్రస్వామి వారి సజీవ సమాధి జరిగి 331 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బ్రహ్మశ్రీ కోటగిరి ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో నవగ్రహ పూజ, హోమం, బ్రహ్మంగారి సజీవ సమాధి ఘట్టం పూజా కార్యక్రమాలు జరిగాయి. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేయగా, పొన్నోజు పావని-మనోహర్ దంపతులు పెద్దఎత్తున మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కస్తూరి నరేంద్రచారి, మునిగంటి నాగరాజు, రావుల వేణు, తేలుకుంట్ల వేణు, శ్రీను, రావుల బిక్షపతి, గుగ్గిల రాజేంద్రప్రసాద్, పొన్నోజు సుధాకర్‌చారి, రంగు పందరి, వలబోజు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన క్రైస్తవ ఉజ్జీవ మహాసభలు

కరీంనగర్ కల్చరల్, మే 17: జిల్లా కేంద్రంలోని సెయింట్ మార్కు చర్చి గ్రౌండ్‌లో సిఎస్ఐ సంఘాల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగనున్న క్రైస్తవ ఉజ్జీవ మహా సభలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. సభలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఆదరణ కల్గిన ప్రసంగీకుడు జెన్నీ క్రిస్టోఫర్ హాజరై వాక్య పరిచర్య అందించారు. మానవాళికి ఏసు క్రీస్తు అందించిన సందేశం చేరాలనే ఉద్దేశ్యంతో సభలు జరుగుతున్నాయన్నారు. క్రీస్తు చూపిన శాంతి, సత్యం, అహింస, న్యాయం, ధర్మం, ప్రేమ మార్గాల్లో అందరూ మానవులు పయనించాలని అన్నారు.

'వర్కింగ్ కమిటీ ఎన్నిక'

కొత్తపల్లి, మే 17: గ్రానైట్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో కూడిన వర్కింగ్ కమిటీని ఎన్నుకున్నారు. శుక్రవారం అడ్వైజరీ కమిటీ మెంబర్స్ చిట్టుమల్ల శ్రీనివాస్, మధుసూదన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి న్యాయవాది వేణుగోపాల్ ముఖ్య అధితిగా హాజరయ్యారు. గతంలో జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో సూచించినట్లుగా 18 మందితో కూడిన వర్కింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ వర్కింగ్ కమిటీ అసోసియేషన్‌కు సంబంధించిన అన్ని కార్యక్రమాలను పర్యవేక్షిస్తుందన్నారు. తదుపరి అధ్యక్షుడిని ఎన్నుకునే వరకు కమిటీ పనిచేస్తుందన్నారు.

నకిలీ ఎరువులు అమ్మితే కఠిన చర్యలు

చొప్పదండి, మే 17: నకిలీ ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చొప్పదండిలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు ఎరువుల దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

ఎంబిఎ, ఎంసీఏ ఫలితాల్లో ఎస్ఆర్ఎం విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, మే 17: శాతవాహన యూనివర్సిటీ గురువారం ప్రకటించిన ఎంబిఏ, ఎంసీఏ మొదటి, మూడవ సెమిస్టర్ ఫలితాల్లో ఎస్ఆర్ఎం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని కళాశాల ప్రిన్సిపాల్ సి వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబిఏ మొదటి సెమిస్టర్‌లో గుంటి త్రివేణి 6.97, వేల్పుల శ్రీవాణి 6.73, ఎంసిఏలో ఎ సుదీక్ష 8.0, స్పందన 7.9 సాధించగా, ఎంబిఏ మూడవ సెమిస్టర్‌లో ఎం హర్షిత 6.81, పి నవ్య6.73, ఎంసిఏలో వి శ్రీజ7.72, బి సౌమ్య 7.58 జిపిఏ సాధించి మొదటి, ద్వితీయ స్థానాలను సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మెన్ ఎం తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు విద్యార్థులను అభినందించారు.

పూజారి కుటుంబానికి పరామర్శ

భగత్‌నగర్, మే 17: రేకుర్తిలోగల మహా అమ్మాయి దేవాలయం ఎలగందుల పూజారి కలికోట రాజమౌళి అనారోగ్యంతో ఇటీవల మరణించాడు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో విష్ణుప్రసాద్‌రావు, నాగుల వెంకటేష్, చంద్రగిరి వేణు తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలి

గణేశ్‌నగర్,మే 17: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్లను 20శాతం నుంచి 42 శాతంకు పెంచిన తర్వాత చేపట్టాలని బీసీ సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆధితిగా జాతీయ బి.సి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసిపెద్ది శ్రీధర్ రాజు హాజరై మాట్లాడారు. సమావేశానికి రాజేశ్‌గౌడ్, మియ్యపురం రవీంద్రాచారి, నగేష్‌శ్రీనివాస్ రాజు, మ్యాడగోని వెంకటేశం, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారుల విచారణ



లింగాపూర్‌లో విచారణ జరుపుతున్న వైద్యాధికారులు

మానకొండూర్, మే 17: మండలంలోని లింగాపూర్‌లో వైద్యాధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన కనుకవ్వ అనే వృద్ధురాలు అనారోగ్యానికి గురి కాగా గ్రామానికి చెందిన కోళ్ళ మమత అనే ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించి అనారోగ్య పాలై కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కాగా తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి చైర్మన్ డాక్టర్ మహేశ్‌కుమార్ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా డాక్టర్ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో టీఎస్ఎంసీ ప్రత్యేక లీగల్ ఎంక్వైరీ బృందం మండలంలోని లింగాపూర్‌లో విచారణ చేపట్టారు. బాధితురాలు కనుకవ్వకు ఆర్ఎంపీ హైడోస్ అంటీ బయోటిక్స్, ఇతర మందులను సెలైన్‌లో కలిపి ఇచ్చినట్టుగా గుర్తించారు. ఆర్ఎంపీ గ్రామంలోని ఇతర పేషంట్లకు హైడోస్ స్టెరాయిడ్స్, హైడోస్ పెయిన్ కిల్లర్స్, ఆంటి బయోటిక్స్ ఇంజక్షన్స్ ఇస్తున్నట్లు ఈ తనిఖీ బృందం గుర్తించింది. అలాంటి మందులను సీజ్ చేసి ఇతర ఆధారాలను రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తామన్నారు. ఎటువంటి విద్యార్హతలు లేకపోవడమే కాకుండా వైద్యం చేస్తున్న వారిపై తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకుంటామని రాజ్ కుమార్ తెలిపారు. తనిఖీ బృందంలో కరీంనగర్ ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ వెంకట్‌రెడ్డి, హెచ్‌ఆర్‌డీఏ కరీంనగర్ కార్యదర్శి శరణ్‌సాయి తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చొప్పదండి, మే 17: చొప్పదండిలోని వారసంతలో దారుల్‌ఖైర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ నాగరాజు శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు జహీరొద్దీన్, మస్జీద్ అధ్యక్షుడు ఆబిద్ అలి, డాక్టర్ ఖుద్దూస్, రిజ్వాన్ అలి, అహ్మద్, నాజిబ్. గౌసొద్దిన్, షరీఫ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

మానకొండూర్, మే 17: మండలంలోని శంషాబాద్ బీఆర్ఎస్ గ్రామశాఖ ఉపాధ్యక్షుడు కొండ బాలయ్య సతీమణి కొండ కనుకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. కాగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు శుక్రవారం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి తన సానుభూతి తెలిపారు. ఆయన వెంట జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు బాకారపు ఐలయ్య, బూన సంతోష్, మేరుగు సంపత్, గట్టు మచ్చయ్య, నాయకులు ఉన్నారు.